

## మళ్లీ పెళ్లిచూపులు కాంబినేషన్?

విజయ్ దేవరకొండను హీరోగా నిలబెట్టిన సినిమా 'పెళ్లి చూపులు'. చిన్న సినిమా రూపురేఖలు మార్చిన సినిమా అది. దర్శకుడిగా తరుణ్‌భాస్కర్‌కి మంచి పేరు తీసుకురావడంతోపాటు ఉత్తమ సంభాషణా రచయితగా జాతీయ అవార్డును కూడా అందించిందా సినిమా. ఆ తర్వాత విజయ్ దేవరకొండ, తరుణ్‌భాస్కర్ ఇద్దరూ వారివారి ప్రాజెక్టులతో బిజీ అయిపోయారు. ఈ ఉపోద్ఘాతమంతా దేనికంటే.. మళ్లీ వీరిద్దరూ కలిసి పనిచేయబోతున్నట్టు ఫిల్మ్‌వర్గాల సమాచారం. ఇప్పటికే విజయ్‌కి తరుణ్‌భాస్కర్ కథ వినిపించాడట. విజయ్ కూడా ఓకే చెప్పాడట. ఇప్పటివరకూ చిన్న సినిమాలు చేసిన తరుణ్‌భాస్కర్ ఈ సినిమాతో పంథా మార్చి భారీ సినిమా చేయబోతున్నట్టు తెలుస్తున్నది. యాక్షన్‌తోపాటు తరుణ్‌భాస్కర్ స్టైల్ ఆఫ్ హ్యూమర్ కూడా కథలో ఉంటుందని వినికిడి. ఈ కాంబినేషన్‌లో సినిమా చేయడానికి ప్రస్తుతం చాలామంది నిర్మాతలు రెడీగా ఉన్నారు. మరి ఈ బాధ్యతను విజయ్ దేవరకొండ ఏ నిర్మాతకు అప్పజెబుతాడో చూడాలి.



## జ్యోతిక సపోర్ట్ వల్లే కంగువా చేయగలిగా

' 'కంగువా' డబ్బుకోసం చేసిన సినిమా కాదు. మీ అందరికీ ఒక గొప్ప సినిమా ఇవ్వాలనే తలంపుతో చేసిన సినిమా. సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇచ్చేలా ఈ సినిమా ఉంటుంది. నేను 'కంగువా' లాంటి బిగ్ మూవీ చేసేందుకు నా వైఫ్ జ్యోతిక సపోర్ట్ ఎంతో ఉంది.' అని సూర్య అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'కంగువా'. శివ దర్శకుడు. జ్ఞానవేల్‌రాజా నిర్మాత. నవంబర్ 14న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ ఆదివారం వైజాగ్‌లో జరిగింది. ఈ సందర్భంగా సూర్య మాట్లాడారు. ప్రతి దర్శకుడికీ ఒక ఎపిక్ మూవీ చేయాలనుంటుందని, తనకు అలాంటి సినిమానే 'కంగువా' అని, అద్భుతమైన టీమ్ దొరకడం వల్లే ఈ సినిమా ఇంత బాగా వచ్చిందని దర్శకుడు శివ అన్నారు. రాజమౌళి స్ఫూర్తితోనే 'కంగువా' చేశామని నిర్మాత జ్ఞానవేల్ రాజా చెప్పారు. అతిథిగా విచ్చేసిన ఏపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. ఇంకా హీరో సందీప్‌కిషన్, నటుడు అవినాష్, రైటర్ రాకేందుమౌళి కూడా మాట్లాడారు.

## బోల్డ్ స్టేట్మెంట్ అందుకే ఇచ్చాను



''క' అంటే ఏంటి? అసలు కథేంటి? ఈ ప్రశ్నలకు ఈ సినిమా క్లైమాక్స్ సమాధానం ఇస్తుంది. ఇలాంటి కథ, ఇటువంటి క్లైమాక్స్ ఇంతకుముందు చూసుండరు. అందుకే.. సినిమా చూసి మీరు కొత్తగా ఫీల్ కాకుంటే సినిమాలు చేయడం మానేస్తానని బోల్డ్ స్టేట్‌మెంట్ ఇచ్చాను.' అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన హీరోగా రూపొందిన విలేజ్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ 'క'. నయన్‌సారిక, తన్వీరామ్ హీరోయిన్లు. సుజీత్, సందీప్ కలిసి దర్శకత్వం వహించారు. చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మాత. ఈ నెల 31న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం కిరణ్ అబ్బవరం విలేకరులతో ముచ్చటించారు. 'నిజానికి ఇదో సైకలాజికల్ థ్రిల్లర్. ఎవరు? ఏంటి? ఎక్కడ? అనే సస్పెన్స్‌తో కథ సాగుతుంది. 1977లో కృష్ణగిరి అనే ఊరిలో పనిచేసే పోస్ట్‌మ్యాన్ అభినయ వాసుదేవ్‌గా నేను కనిపిస్తా. రియలిస్టిక్‌గా వచ్చేందుకు ఇందులోని యాక్షన్ సీన్స్ చాలా వరకూ డూప్ లేకుండా చేశాను. దర్శకులు సుజీత్, సందీప్ చాలా క్లారిటీగా, డెడికేషన్‌తో సినిమా చేశారు. ఎక్కడ్నుంచీ రిఫరెన్స్ తీసుకోకుండా కొత్తగా ట్రై చేశారు. నిజానికి ఈ సినిమాను పాన్ ఇండియా రిలీజ్‌కి ప్లాన్ చేశాం. తమిళ సినిమాలు రిలీజులు ఎక్కువ ఉండటంతో తమిళనాడు థియేటర్లు దొరకలేదు. మలయాళంలో దుల్కర్ 'లక్కీభాస్కర్' విడుదల అదే రోజు ఉంది. ఆయనే మా సినిమా కూడా మలయాళంలో రిలీజ్ చేస్తున్నారు. అందుకే.. ఒకే ప్రొడక్షన్ నుంచి రెండు సినిమాలు ఒకే రోజు విడుదల చేయడం కరెక్ట్ కాదని మలయాళంలో రిలీజ్ ఆపాం' అని కిరణ్ అబ్బవరం తెలిపారు.

# ఈ అవార్డుతో జీవితానికి పరిపూర్ణత

### రచ్చ గెలిచి ఇంట గెలిచానని చిరంజీవి భావోద్వేగం • నేను తెలుగు సినిమా కుటుంబ సభ్యుడ్నే :అమితాబ్



సినీరంగంలో తాను రచ్చ గెలిచి ఇంట గెలిచానని వ్యాఖ్యానించారు అగ్ర నటుడు చిరంజీవి. ఏఎన్నార్ నేషనల్ అవార్డును అందుకోవడంతో తాను ఇంట గెలిచానని గర్వంగా ఉందన్నారు. వజ్రోత్సవాల సందర్భంగా తనకు జరిగిన చేదు అనుభవాన్ని గుర్తుచేసుకొని చిరంజీవి భావోద్వేగానికి గురయ్యారు. సోమవారం హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో నిర్వహించిన వేడుకలో 'అక్కినేని నాగేశ్వరరావు జాతీయ అవార్డు'ను ఆయన అందుకున్నారు. 2024 సంవత్సరానికిగానూ ఈ అవార్డును ప్రదానం చేశారు. అమితాబ్‌బచ్చన్ చేతుల మీదుగా చిరంజీవి పురస్కారాన్ని స్వీకరించారు.

#### చిరంజీవి ఏది అడిగినా ఇవ్వడానికి సిద్ధంగా ఉంటారు: అమితాబ్ బచ్చన్

చిరంజీవి, నాగార్జున, నాగ్‌అశ్విన్ వంటి వారు నన్ను తెలుగు సినిమాల్లో భాగం చేశారు. తెలుగు ఇండస్ట్రీలో నేను కూడా ఓ సభ్యుడినేనని గర్వంగా చెప్పుకుంటా. తెలుగు చిత్రసీమలో నన్నూ ఓ భాగంగా పరిగణించండి. ఇండియన్ సినిమాకు నాగేశ్వరరావుగారు చేసిన సేవలు అనితరసాధ్యం. ఇక చిరంజీవి నేను ఎప్పుడు ఏది అడిగినా ఇవ్వడానికి సిద్ధంగా ఉంటారు. చిరంజీవి ప్రేమ, అభిమానానికి ధన్యవాదాలు.

#### రచ్చ గెలిచి ఇంట గెలిచాను: చిరంజీవి

అమితాబ్‌బచ్చన్ నాకు గురువు, స్ఫూర్తిప్రదాత. నాకు ఏ అవార్డు వచ్చినా తొలుత ఆయన నుంచే శుభాకాంక్షలు అందుతాయి. పద్మభూషణ్ అవార్డు వచ్చినప్పుడు జరిగిన సన్మాన కార్యక్రమంలో అమితాబ్‌గారు 'చిరంజీవి కింగ్ ఆఫ్ ఇండియన్ సినిమా' అని చెప్పడం నేను ఇప్పటికీ మర్చిపోలేను. ఆయన మాటలు నాకు స్ఫూర్తినిచ్చాయి. అమితాబ్‌బచ్చన్‌గారితో గడిపిన ప్రతి క్షణం విలువైనది. ఇండియన్ సినిమాకు బాద్‌షా, షెహన్‌షా అయిన అమితాబ్ నుంచి ఈ అవార్డు స్వీకరించడం గర్వంగా ఉంది. తెలుగులో ఇంట గెలిచి రచ్చ గెలవాలి అనే ఓ నానుడి ఉంది. నా విషయంలో రచ్చ గెలిచి ఇంట గెలిచానని అనిపిస్తోంది. నేను ఇంట గెలిచే అవకాశం తెలుగు సినిమా వజ్రోత్సవాల సమయంలో వచ్చింది. నాకు అప్పుడు లెజెండరీ పురస్కారం ప్రదానం చేశారు. అప్పుడు ఎంతో ఆనందపడి ధన్యుణ్ణి అనుకున్నా. కానీ కొన్ని ప్రతికూల పరిస్థితుల వల్ల, కొందరు వ్యక్తులు హర్షించని కారణంగా ఆ పురస్కారాన్ని తీసుకోవడం సముచితం అనిపించలేదు. అందుకే ఆ రోజు అవార్డుని ఓ క్యాప్సుల్ బాక్స్‌లో పడేసి నాకు అర్హత ఎప్పుడు వస్తుందో అప్పుడే తీసుకుంటానని చెప్పాను. ఆ రోజు నేను ఇంట గెలవలేదు. ఈ రోజు ది గ్రేట్ ఏఎన్నార్ అవార్డును ది గ్రేట్ అమితాబ్‌బచ్చన్‌గారి చేతుల మీదుగా అందుకున్నా. ఇప్పుడు నేను ఇంట గెలిచాను.. రచ్చగెలిచాను అనిపిస్తోంది. ఈ పురస్కార ప్రదానం గురించి చెప్పడానికి నాగార్జున, వెంకట్ ఇంటికి వచ్చినప్పుడు చాలా ఆనందించాను. నాకు పద్మభూషణ్, పద్మవిభూషణ్, గిన్నిస్‌బుక్‌లో స్థానం వచ్చినా ఈ అవార్డు విషయంలో నా భావోద్వేగం వేరుగా ఉంది. నావాళ్లు నన్ను గుర్తించి అవార్డు ఇస్తుండటం నాకు గొప్ప విషయంగా అనిపించింది. ఇది నాకు అన్ని పురస్కారాలకు మించిన ప్రత్యేకమైన అవార్డు అని నాగార్జునతో చెప్పాను. ఈ వేడుకలో మా అమ్మని ముందు సీటులో కూర్చొబెట్టడానికి ప్రధాన కారణం..అమ్మ నాగేశ్వరరావుగారికి వీరాభిమాని. అక్కినేని నాగేశ్వరరావుగారితో కలిసి 'మెకానిక్ అల్లుడు' చిత్రంలో నటించినప్పుడు ఎన్నో మంచి విషయాలు నేర్చుకున్నా. సెట్‌లో ఆయన్ని చూస్తే నడిచే ఎన్‌సైక్లోపీడియా అనిపించేది. ఆయన నాకు పితృసమానులు. ఈ విషయం ఎక్కడా చెప్పే అవకాశం రాలేదు. అందుకే ఇక్కడ చెబుతున్నా. దేవానంద్, లతా మంగేష్కర్, అమితాబ్ బచ్చన్, కె.బాలచందర్ వంటి లెజెండ్స్‌కు దక్కిన ఈ పురస్కారం నాకు దక్కడ పూర్వ జన్మ సుకృతం. ఈ అవార్డు నా జీవితానికి పరిపూర్ణతనిచ్చింది. ఈ రోజుని జీవితాంతం గుర్తుంచుకుంటాను. నాగార్జున నాకు భగవంతుడు ఇచ్చిన అద్భుతమైన స్నేహితుడు. నాకు ఆహారం, ఆరోగ్యం విషయంలో ఎప్పుడూ సలహాలిస్తుంటాడు. ఆయన ఏం చెప్పినా ఫాలో అయిపోతుంటాను. అక్కినేని కుటుంబం మొత్తం మా కుటుంబ సభ్యుల్లాంటివారే. వారు చూపించే ప్రేమను నేను జీవితాంతం పదిలపరచుకుంటాను.



#### ఆ మాటలు నిజం: నాగార్జున

'భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచే గొప్ప వ్యక్తులను గౌరవించుకోవడమే ఏఎన్నార్ అవార్డు ముఖ్య ఉద్దేశం. ఈ రోజు ఈ వేదికపై అలాంటి గొప్ప వ్యక్తులు ఇద్దరు ఉన్నారు. వారే ఇండియన్ సినిమా బిగ్‌బీ అమితాబ్ బచ్చన్, మెగాస్టార్ చిరంజీవి. ఈ ఏడాది ఏఎన్నార్ పురస్కారాన్ని నా మిత్రుడు పద్మవిభూషణ్ చిరంజీవికి అందిస్తున్నందుకు మా కుటుంబసభ్యులంతా గర్విస్తున్నాం.. ఆనందిస్తున్నాం. దాన్ని మనందరం ఎంతగానో ఆరాధించే పద్మవిభూషణ్ అమితాబ్‌బచ్చన్‌గారు ప్రజెంట్ చేయడం ఈ వేడుకకు ఇంకా ప్రత్యేకం. రీసెంట్‌గా 'కల్కి' చూశాను. అమితాబ్‌జీ అశ్వత్థామగా చూసినప్పుడు మా ఒరిజినల్ మాస్ హీరో ఈజ్ బ్యాక్ అనిపించింది. ఇదే విషయం ఆయనకు కాల్ చేసి చెప్పాను. మాలాంటివారందరికీ ఆయనే ఇన్‌స్పిరేషన్. ఇక మిత్రుడు చిరంజీవితో నాకెన్నో బ్యూటిఫుల్ మెమరీస్ ఉన్నాయి. రికార్డులు బ్రేక్ చేయడం ఆయనకు అలవాటు. ఇటీవలే గిన్నిస్‌బుక్‌లోకి కూడా ఎక్కేశారు. నేను సినిమాల్లోకి వద్దామనుకుంటున్న రోజుల్లో చిరంజీవి షూటింగ్ మా స్టూడియో జరుగుతుంటే 'ఒకసారి వెళ్లి చూసి నేర్చుకో..' అని నాన్నగారు చెప్పారు. వెళ్లి చూశాను. ఏదో వాన పాట షూటింగ్ జరుగుతుంది. చిరంజీవి, రాధ డ్యాన్స్ చేస్తున్నారు. ఆ డ్యాన్స్, ఆయన గ్రేస్ చూశాక నాకు భయమేసింది. సినిమాలు మనకు కరెక్ట్ కాదని, మరో దారి చూసుకుందాం అనుకున్నా. నటుడిగానే కాదు, ఎన్నో సేవాకార్యక్రమాలతో సంఘ సేవకునిగా కూడా పదుగురికి ఆదర్శంగా నిలిచారు చిరంజీవి. ఆయన్ను అమితాబ్ 'కింగ్ ఆఫ్ ఇండియన్ సినిమా'గా అభివర్ణించారు. అది ముమ్మాటికి నిజం. అలాంటి గొప్ప వ్యక్తికి నాన్నగారి అవార్డు అందించడం ఆనందంగా ఉంది' అన్నారు నాగార్జున. ఇంకా ఈ కార్యక్రమంలో చిరంజీవి తల్లిగారైన అంజనాదేవి, టి.సుబ్బిరామిరెడ్డి, వెంకటేశ్, ఎం.ఎం.కీరవాణి, రామ్‌చరణ్, బ్రహ్మానందం తదితరులతోపాటు అక్కినేని కుటుంబసభ్యులందరూ పాల్గొన్నారు.



## తల్లి పాత్రను చాలెంజ్‌గా తీసుకున్నా!

'నా కెరీర్‌లో మొదటిసారి తల్లి పాత్ర పోషించాను. ఈ క్యారెక్టర్ కొంచెం ఛాలెంజింగ్‌గా అనిపించింది. చిన్నతనంలో నాతో అమ్మ ఎలా ఉండేదో అనే విషయాలను తెలుసుకొని నటించా. నటిగా పాత్రల విషయంలో వైవిధ్యం చూపించాలనుకుంటున్నా. అందుకు తగినట్లుగా సినిమాలను ఎంచుకుంటున్నా' అని చెప్పింది మీనాక్షి చౌదరి. ఆమె కథానాయికగా నటించిన తాజా చిత్రం 'లక్కీ భాస్కర్' ఈ నెల 31న విడుదలకు సిద్ధమవుతున్నది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మీనాక్షి చౌదరి మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను సుమతి అనే మధ్యతరగతి ఇల్లాలి పాత్రలో కనిపిస్తా. ప్రేమను పంచే భర్త, బ్రతకడానికి అవసరమైనంత డబ్బు ఉంటే చాలనుకునే స్వభావం ఆమెది. అయితే భర్త భాస్కర్‌కు డబ్బు పట్ల ఉండే విపరీతమైన వ్యామోహం వల్ల దంపతుల జీవితం ఎలాంటి మలుపులు తిరిగిందన్నది ఆసక్తికరంగా ఉంటుంది' అని చెప్పింది. ఈ సినిమాతో నటిగా తనకు మంచి గుర్తింపు లభిస్తుందనే నమ్మకం ఉందని, భవిష్యత్తులో మరిన్ని ఛాలెంజింగ్ రోల్స్ చేసే అవకాశం లభిస్తుందని మీనాక్షి చౌదరి విశ్వాసం వ్యక్తం చేసింది. బ్యాంకింగ్ నేపథ్యంలో ఇప్పటికే కొన్ని సిరీస్‌లు వచ్చినా.. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో దర్శకుడు ఈ కథను అద్భుతంగా రాశాడని, ఇది సామాన్యుడి కథ కాబట్టి ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుందని తెలిపింది. తన తదుపరి సినిమాల గురించి చెబుతూ 'మట్కా, మెకానిక్ రాకీ విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. వెంకటేష్-అనిల్ రావిపూడి సినిమాలో నటిస్తున్నా. మరి కొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నాయి' అని చెప్పింది.

## నమో ఈశ్వర..



మహేష్‌బాబు మేనల్లుడు అశోక్ గల్లా కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకుడు. సోమినేని బాలకృష్ణ నిర్మాత. నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని 'నమో ఈశ్వర' అనే పాటను సోమవారం విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో స్వరపరచిన ఈ గీతాన్ని శ్రీనివాసమౌళి రచించారు. శివున్ని స్తుతిస్తూ చక్కటి అధ్యాత్మిక భావాలతో ఈ పాట సాగింది. హీరో అశోక్ గల్లా ఇంటెన్స్ లుక్‌లో కనిపించారు. విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. డివైన్ ఎలిమెంట్స్‌తో కూడిన యాక్షన్ ఫ్యామిలీ యాక్షన్ డ్రామా ఇదని, భావోద్వేగాలు హృదయాన్ని కదిలిస్తాయని చిత్ర బృందం పేర్కొంది. వారణాసి మానస కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ప్రసాద్ మూరెళ్ల, రసూల్ ఎల్లోర్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సంభాషణలు: సాయి మాధవ్ బుర్రా, కథ: ప్రశాంత్‌వర్మ, దర్శకత్వం: అర్జున్ జంధ్యాల.



## ఇక జాగ్రత్తగా ఉంటా!

కథాంశాల ఎంపికలో గతంలో మాదిరిగా తప్పులు జరగకుండా చూసుకుంటానని, రాబోవు ఏడాదిలో వైవిధ్యమైన కథలకే ప్రాధాన్యతనిస్తానని చెప్పింది అగ్ర కథానాయిక పూజా హెగ్డే. గతకొంతకాలంగా ఈ భామకు టైమ్ కలిసి రావడం లేదు. హిందీతో పాటు దక్షిణాదిలో కూడా విజయాలకు దూరమైంది. అయితే తమిళ, తెలుగు భాషల్లో ఈ భామకు మంచి ఆఫర్లొస్తున్నట్లుగా తెలుస్తున్నది. దళపతి విజయ్ నటిస్తున్న 69వ చిత్రంలో నాయికగా ఆమె పేరే వినిపిస్తున్నది. సూర్య 44వ సినిమాలో కూడా పూజాహేగ్డే కథానాయికగా ఖరారైందని అంటున్నారు. ఈ నేపథ్యంలో బాలీవుడ్‌లో కూడా ఈ సొగసరి భారీ ఆఫర్‌ను సొంతం చేసుకుంది. వరుణ్‌ధావన్ సరసన ఓ కామెడీ ఎంటర్‌టైనర్‌లో నటించబోతున్నట్లు తెలిసింది. 'హే జవానీ తో ఇష్క్ హోనా హై' పేరుతో తెరకెక్కనున్న ఈ చిత్రానికి డేవిడ్ ధావన్ దర్శకుడు. కాస్త విరామం తర్వాత బాలీవుడ్‌లో భారీ ప్రాజెక్ట్‌ను సొంతం చేసుకోవడం పట్ల పూజాహెగ్డే ఆనందం వ్యక్తం చేసింది. 'సినిమాల ఎంపికలో నా మైండ్‌సెట్‌ను మార్చుకున్నా. కథల ఎంపికలో ఇకపై మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తా. నా గత చిత్రాలన్నింటిని విశ్లేషించి ఎక్కడ తప్పులు జరిగాయో తెలుసుకుంటా. వచ్చే ఏడాది నాకు మంచి విజయాల్ని అందిస్తుందనే నమ్మకంతో ఉన్నా' అని పూజాహెగ్డే చెప్పింది.

## ప్రేమకథల సమాహారం

'YO! 10 ప్రేమకథలు' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతున్నది. పి.సి.క్రియేషన్స్ సమర్పణలో మనూటైమ్స్ మూవీ మిషన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో పదిమంది పాపులర్ హీరోహీరోయిన్లు నటించబోతున్నారు. మనోహర్ చిమ్మని దర్శకుడు. ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో లాంఛనంగా మొదలైంది. అతిథులుగా విచ్చేసిన దర్శకులు వీరశంకర్, చంద్రమహేశ్, బాబ్జీ మూవీ పోస్టర్‌పై క్లాప్ కొట్టి, చిత్రయూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. ఈ తరం యువతీయువకుల ఆలోచనలు, జీవనశైలి చుట్టూ అల్లిన పది ప్రేమకథల సమాహారమే ఈ సినిమా అని దర్శకుడు మనోహర్ చిమ్మని చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: వీరేంద్ర లలిత్, సంగీతం: ప్రదీప్‌చంద్ర.





## కావాలంటే గిల్లి చూసుకోండి

ప్లాస్టిక్ సర్జరీలు చేయించుకున్నట్టు హీరోయిన్లపై వస్తున్న వార్తలపై ఇటీవల ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నయనతార స్పందించింది. 'పని లేనివాళ్లు సృష్టించే చెత్త ఇదంతా. గతంలో నాపై కూడా ఇలాంటి రూమర్లు వచ్చాయి. ముఖంలో కాస్త మార్పు కనిపిస్తే ప్లాస్టిక్ సర్జరీ అనేస్తారు. మేకప్ గురించి అవగాహన ఉన్నవాళ్లయితే ఇలాంటివి రాయరు. నా కనుబొమ్మలంటే నాకు చాలా ఇష్టం. సందర్భాన్ని బట్టి వాటి ఆకారం మారుస్తుంటాను. వాటికోసం ఎంతో సమయాన్ని వెచ్చిస్తుంటా. కనుబొమ్మల ఆకారం మారినప్పుడల్లా ముఖంలో మార్పు కనిపిస్తుంది. అది చూసి ప్లాస్టిక్ సర్జరీ అనేస్తారు. నిజానికి ముఖంలో మార్పులు రావడానికి చాలా కారణాలు ఉంటాయి. ఒక్కోసారి డైటింగ్ వల్ల బుగ్గలు లోపలికి వెళ్లినట్టు కనిపిస్తాయి. రెండుమూడురోజులు రెస్ట్ తీసుకొని బయటకొస్తే బుగ్గలు పెరిగినట్టు కనిపిస్తాయి. వాటికి కూడా ప్లాస్టిక్ సర్జరీ అనేస్తే ఎలా? కావాలంటే నన్ను గిచ్చి చూసుకోవచ్చు. నా శరీరంలో ఎక్కడా ప్లాస్టిక్ ఉండదు' అంటూ అందంగా నవ్వేసింది నయనతార.